


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 06-02-2026 | సంపుటి - 26 | సంచిక -258 | రూ : 4 | పేజీలు: 8




2లో

## తెలంగాణ డీజీపీ నియామకంపై

### సుప్రీంకోర్టు సీరియస్..

## 4 వారాల్లో తేల్చాల్సిందే

- ఇన్‌చార్జ్ పాలన చెల్లదు
- 4 వారాల్లో తెలంగాణ డీజీపీ నియామకం తేల్చండి: సుప్రీంకోర్టు ఆదేశం

### హన్మకొండలో మేడారం

## హుండీల లెక్కింపు


2లో

- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ
- టీటీడీ కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు
- లెక్కింపునకు పది రోజుల సమయం పట్టే అవకాశం

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను

# అరెస్టు చేయాలి

**బీజేపీకి రేవంత్ రెడ్డి డిమాండ్**
2లో

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమన్న ముఖ్యమంత్రి
- ఏపీలో అధికారం కోల్పోతామని తెలిసినా సోనియా తెలంగాణ ఇచ్చారని వ్యాఖ్య
- అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్న






### పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో

## భారత్ 'వాయు' గర్జన

- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో వాయుసేన భారీ విన్యాసాలు
- ఫిబ్రవరి 27న జైసల్మేర్‌లో 'వాయు శక్తి 2026' పేరిట ప్రదర్శన
- 'ఆపరేషన్ సిందూర్' తరహాలో సాగనున్న ఎక్సర్‌సైజ్

2లో



## ముంబయిలో లిఫ్ట్‌లో గ్యాస్ బెలూన్లు పేలి మంటలు..

- ముంబయిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- బెలూన్ షాపు యజమానిపై కేసు నమోదు చేసిన పోలీసులు

2లో

### నిరసనల మధ్య... రాజ్యసభలో

## ప్రధాని మోదీ ప్రసంగం


2లో


- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య

### బొగ్గు గనిలో పేలుడు..

## 16 మంది మృత్యువాత

- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 16 మంది కార్మికులు మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు


2లో


2లో

### ఏపీకి శుభవార్త

## చెప్పిన నితిన్ గడ్కరీ

- మచిలీపట్నం పోర్టుకు రూ. 573.77 కోట్లతో కొత్త రోడ్డు
- 6లేన్ల ఎక్స్‌టర్నల్ పోర్ట్ కనెక్టివిటీ రోడ్డుకు కేంద్రం ఆమోదం
- జాతీయ రహదారుల నుంచి పోర్టుకు నేరుగా అనుసంధానం
- ఈ ప్రాజెక్టులో 3 ఫ్లైఓవర్లు, ఒక రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం
- రవాణా సమయం తగ్గి, లాజిస్టిక్స్ సామర్థ్యం పెరుగుతుందని వెల్లడి

### వైసీపీ హయాంలో చేసిన పనులకు

# బిల్లులు మేమే చెల్లిస్తాం: సీఎం

- ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యమని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ ఉండదని కీలక హామీ
- వైసీపీ ప్రభుత్వంలో పెండింగులో ఉన్న బిల్లులు కూడా చెల్లిస్తామని భరోసా
- పరుగెత్తే నీటిని నిలిపి భూగర్భ జలాలు పెంచాలని సంఘాలకు సూచన
- ప్రత్యామ్నాయ పంటలతో రైతుల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి

2లో



# వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం

అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతను నీటి వినియోగదారుల సంఘాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించే బాధ్యత తమదేనని ఆయన కీలక హామీ ఇచ్చారు. గురువారం అమరావతిలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నీటి భద్రత అందరికీ అవసరం కానీ, దాని సంరక్షణపై చాలా మందికి శ్రద్ధ లేదు. పరుగెత్తే నీటిని నిలపాలి, నడిచే నీటిని జలాశయంగా మార్చాలి. అప్పుడే భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది" అని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 40 జీవనదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాటే వినిపించదని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని, ఇప్పుడు రైతులకు అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తున్నామని తెలిపారు. సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తున్నందున, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాల్సిన బాధ్యత వాటిపైనే ఉందని సీఎం దిశానిర్దేశం చేశారు. నీటి పన్నులు వసూలు చేసుకుని, ఆ నిధులతో కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చని సూచించారు. రాష్ట్రంలో 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సరైన సమయంలో నీరందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తూ, భూగర్భ జలాల పెంపు, కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బొగ్గు గనిలో పేలుడు...
# 16 మంది మృత్యువాత

మేఘాలయ: మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్కె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్ హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

ఢిల్లీ: భారత వాయుసేన (IAF) తన సైనిక శక్తిని, వ్యూహాత్మక సంసిద్ధతను ప్రదర్శించేందుకు సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఫిబ్రవరి 27న 'వాయు శక్తి 2026' పేరిట భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించనుంది. గతంలో సరిహద్దు దాటి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలో ఈ విన్యాసాలను రూపొందించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత వాయు శక్తి సామర్థ్యాలు మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి. ఈ విన్యాసాల్లో వందకు పైగా విమానాలు పాల్గొననున్నాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రఫేల్, సుఖోయ్30, తేజస్, మిగ్29, జాగ్వార్, మిరాజ్2000, హాక్ వంటి యుద్ధ విమానాలు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించనున్నాయి. వీటితో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రచండ్ అటాక్ హెలికాప్టర్ కూడా రాకెట్లను ప్రయోగిస్తుంది. వాయుసేన నుంచి వైదొలిగిన మిగ్21 విమానం ఈ తరహా విన్యాసాల్లో కనిపించకపోవడం ఇదే తొలిసారి. ఒక కృత్రిమ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (IACCS) ద్వారా ఈ మొత్తం విన్యాసాలను పర్యవేక్షించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ విమానాలు, క్షిపణుల గమనాన్ని గుర్తించింది ఈ వ్యవస్థే. ఈ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సి295 రవాణా విమానం మొదటిసారిగా రాత్రిపూట అసాల్ట్ ల్యాండింగ్ డ్రిల్ నిర్వహించనుంది. సి130జె సూపర్ హెర్క్యులస్ విమానం చిన్న రన్‌వేపై ల్యాండ్ అయి, గరుడ్ కమాండోలను దించి, వెంటనే టేకాఫ్ అవుతుంది. ఈ విన్యాసాల గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం అందించినట్లు, 'నోటీస్ టు ఎయిర్‌మెన్' (NOTAM) జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు వీఐపీలతో పాటు, ఢిల్లీలోని సుమారు 40 మిత్రదేశాల రాయబార కార్యాలయాల అధికారులు కూడా హాజరుకానున్నారు.

## నిరసనల మధ్య...
# రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం

ఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు. మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది. ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్‌ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో కేసీఆర్, హరీశ్ రావును, ఫార్ములా ఈకార్ రేసింగ్‌లో కేటీఆర్‌ను అరెస్టు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని విమర్శించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులను అరెస్టు చేసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ కరీంనగర్ గడ్డ నుంచే హామీ ఇచ్చి నెరవేర్చారని అన్నారు. ఏపీలో అధికారం కోల్పోయినా మాట తప్పలేదని అన్నారు. ఏపీ పెట్టుబడిదారులు అడ్డుపడినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినప్పటికీ ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారని, కానీ ప్రజల ఆకాంక్షలను వారు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే తమపై కొంతమంది విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని ఆ కుటుంబం దాడి చేస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ నెల నెలా వేతనం తీసుకుంటున్నారు కానీ సభకు మాత్రం రావడం లేదని, ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని ఆయనకు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడిని తీసుకువచ్చిందని, కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేశాకే వారు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు మీరేం చేశారని బీజేపీ ప్రశ్నిస్తోందని, కానీ పదేళ్లు వారేం చేశారో చెప్పడం లేదని చురక అంటించారు. మోదీ, అమిత్ షా ఎవరిని తీసుకొచ్చినా మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు బీజేపీ గెలవదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అలాంటప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణకు ఎందుకోసం వచ్చినట్లని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో సీబీఐ విచారణ చేయించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిస్తే కేంద్రం స్పందించలేదని మండిపడ్డారు. ఫార్ములా ఈ రేసు కేసులో చర్యలు తీసుకోవాలని కోరినా స్పందించడం లేదని ఆరోపించారు. మెట్రో రైలు మంజూరు చేయలేదని, మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదని అన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని మోదీ, అమిత్ షా కూడా అన్నారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. వెయ్యి బస్సులకు ఆడబిడ్డలను యజమానులుగా చేశామని, రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఆడబిడ్డల చీరల్లో కూడా కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

# ముంబయిలో లిఫ్ట్‌లో గ్యాస్ బెలూన్లు పేలి మంటలు

ముంబయి: ముంబయిలో గ్యాస్‌తో నింపిన బెలూన్లు ఒక్కసారిగా పేలి లిఫ్ట్‌లో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబయి గోరెగావ్ (వెస్ట్) ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బెలూన్లు డెలివరీ చేసేందుకు రాజ్‌కుమార్ మహతో అనే వ్యక్తి లిఫ్ట్‌లోకి ఎక్కాడు. అదే సమయంలో వైద్య విద్యార్థిని హిమానీతో పాటు మరో యువకుడు కూడా లిఫ్ట్‌లోకి వచ్చారు. లిఫ్ట్ కదలకముందే బెలూన్లు ఒక్కసారిగా పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయంతో ముగ్గురూ వెంటనే లిఫ్ట్ నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో రాజ్‌కుమార్ మహతో, హిమానీకి గాయాలయ్యాయి. అపార్ట్‌మెంట్‌లో నిర్వహించనున్న ఓ వేడుక కోసం బెలూన్లను తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బెలూన్ల దుకాణం యజమాని టీకే జైశ్వాల్ సూచనల మేరకు బెలూన్ల డెలివరీ జరుగుతుండటంతో.. ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# హన్మకొండలో మేడారం హుండీల లెక్కింపు

వరంగల్: ఆసియా అతిపెద్ద గిరిజన జాతర మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఈరోజు మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

# తెలంగాణ డీజీపీ నియామకంపై సుప్రీంకోర్టు సీరియస్..

హైదరాబాద్: తెలంగాణ శాశ్వత డీజీపీ నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర డీజీపీ నియామకానికి సంబంధించి నాలుగు వారాల్లోగా తగిన సిఫార్సులు చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి స్పష్టమైన గడువు విధించింది.

**ఇన్‌చార్జ్ పాలనపై ఆగ్రహం**

రాష్ట్రంలో రెగ్యులర్ డీజీపీని నియమించకుండా, కేవలం 'యాక్టింగ్' లేదా 'ఇన్‌చార్జ్' డీజీపీలతో కాలం వెళ్లదీయడంపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాలు సకాలంలో డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపడంలో విపరీతమైన జాప్యం చేస్తున్నాయని కోర్టు పేర్కొంది.

**మెరిట్ ఉన్న ఆఫీసర్లకు అన్యాయం**

"రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ జాప్యం వల్ల నిజాయితీ, సమర్థత కలిగిన ఐపీఎస్ అధికారులకు తీరని అన్యాయం జరుగుతోంది. అర్హత ఉండి కూడా పదవి దక్కకుండా పోతోంది," అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అధికారుల యోగ్యతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని యూపీఎస్సీ సిఫార్సులు చేయాలని సూచించింది.

**రాష్ట్రాలకు సుప్రీం వార్నింగ్**

డీజీపీ నియామకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. రాష్ట్రాలు ప్రతిపాదనలు ఆలస్యం చేస్తే యూపీఎస్సీ చూస్తూ ఊరుకోకూడదని, వెంటనే ఆయా రాష్ట్రాలకు లేఖలు రాయాలని ఆదేశించింది. లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే, కమిషన్ నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని వెసులుబాటు కల్పించింది. దీంతో తెలంగాణ డీజీపీ నియామక ప్రక్రియ రాబోయే నెల రోజుల్లో వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

# ఏపీకి శుభవార్త చెప్పిన నితిన్ గడ్కరీ

ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం పోర్టు అభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పోర్టుకు మెరుగైన కనెక్టివిటీని అందించేందుకు రూ. 573.77 కోట్ల వ్యయంతో 6లేన్ల ఎక్స్‌టర్నల్ పోర్ట్ కనెక్టివిటీ రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వివరాలు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా, జాతీయ రహదారి216లోని మచిలీపట్నం బైపాస్ సెక్షన్ మీదుగా జాతీయ రహదారి 65, జాతీయ రహదారి216 కూడలి నుంచి మచిలీపట్నం పోర్టు వరకు ఈ 6లేన్ల రహదారిని నిర్మించనున్నారు. దీనివల్ల జాతీయ రహదారుల కారిడార్ నుంచి పోర్టుకు నేరుగా, వేగవంతమైన రవాణా సౌకర్యం కలుగుతుందని గడ్కరీ తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో సరుకు రవాణా వాహనాల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆమోదం పొందిన ప్రాజెక్టులో 6లేన్ల ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్లు, 3 ఫ్లైఓవర్లు, ఒక ఓవర్‌పాస్ కమ్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ROB) నిర్మాణం కూడా ఉన్నట్లు కేంద్రమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మచిలీపట్నం పోర్టు లాజిస్టిక్స్ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# నందిగామలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం ప్రారంభం

జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు - దృష్టిలోపం ఉన్న వారికి కళ్లజోళ్ల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు.. నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం జాతీయ అంధత్వ మరియు దృష్టిలోప నివారణ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న విద్యార్థిని విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు మాట్లాడుతూ, చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను నివారించవచ్చని తెలిపారు. విద్యార్థుల



ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని, ముఖ్యంగా దృష్టి లోపం కారణంగా చదువులో వెనుకబడకుండా ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, కూటమి నేతలు కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ మల్లెపాక శ్రీనివాసరావు, హాస్పిటల్ కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్యులు, కూటమి నాయకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఖైతాపురంలో ఉచిత వైద్య శిబిరం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ యెల్మ రామలింగేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామలింగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తన సొంత ఖర్చులతో వైద్యులకు బీపీ ఆపరేటర్ పరికరమును అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎంబీబీఎస్ డాక్టర్ జయంత్, హెల్త్ అసిస్టెంట్ ఆర్ దేవకీ, సీహెచ్ సునిత, బి ప్రవీణ్ రెడ్డి, గ్రామ ఆశావర్కర్ గోపనబోయిన నవ్య, గ్రామ ఉపసర్పంచ్ పెరుమాళ్ళ లింగస్వామి, పంచాయతీ కార్యదర్శి అనుష, వార్డు సభ్యులు తగరం నాగరాజు, గోపనబోయిన అలివేల, గోపనబోయిన కొమిరయ్య స్వప్న, పిసాటి ఉపేందర్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గెలిపించండి..
# అభివృద్ధి చేసి చూపిస్తా

*** 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గుండెబోయిన పూజిత వెంకటస్వామి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తనను కౌన్సిలర్ గా గెలిపిస్తే.. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గుండెబోయిన పూజిత వెంకటస్వామి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డులో సిపిఎం బలపరిచిన బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గుండెబోయిన పూజిత వెంకటస్వామి గురువారం ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. కృష్ణానగర్ నుంచి ప్రచారాన్ని ప్రారంభించి రామ్ నగర్ మీదుగా జాతీయ రహదారి వెంట పద్మశాలి కాలనీ వరకు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి, ఆప్యాయంగా పలకరిస్తూ, తనకు ఓటు ద్వారా మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గుండెబోయిన పూజిత వెంకటస్వామి మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలోనే 13 వ వార్డు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు, లో వోల్టేజ్ నివారణకు ట్రాన్స్ ఫార్మర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు 13వ వార్డులో అతి పెద్ద డ్రైనేజీని నిర్మించిన ఘనత గత ప్రభుత్వ సొంతమన్నారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆశీస్సులతో, 13వ వార్డు అభివృద్ధే ధ్యేయంగా మీ ముందుకు వచ్చానన్నారు. తనను ఆదరించి ఆశీర్వదిస్తే, వార్డును అభివృద్ధి పథంలో నడుపుతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు జెటంగి కృష్ణ, బీఆర్ఎస్ వై నాయకుడు చెవగోని మహేష్ గౌడ్, వార్డు అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్ యాదవ్, ఏనుగుల యాదయ్య, జెటంగి రాజు, మొగుదాల అంజయ్య, జెటంగి రవి, ఏనుగుల లక్ష్మణ్, మొగుదాల విజయ్, పల్స రాకేష్, మీసాల సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణత అభియాన్ 2.0
# లక్ష్యాలు సాధిద్దాం

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంపూర్ణత అభియాన్ 2.0 లక్ష్యాలను సమన్వయంతో సాధించాలని జిల్లా కలెక్టర్ జి.వి. పాటిల్ పేర్కొన్నారు. గురువారం గుండాల పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అవగాహన ర్యాలీలో పాల్గొని, ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు.జనవరి 28 నుంచి ఏప్రిల్ 14 వరకు అభియాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించడం, పిల్లల ఎత్తుబరువు నమోదు, 6 నెలల నుంచి 6 సంవత్సరాల పిల్లలకు బాలామృతం, పోషకాహారం అందించాలన్నారు. సర్పంచులు అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎంలు టిబి బాధితులను గుర్తించి చికిత్స అందించాలన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని, పశుగ్రాసం సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అభియాన్ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాను, గుండాల మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డబ్ల్యుసీడీ అధికారి ఎల్. స్వర్ణలత, డీఎంహెచ్‌వో డా. తుకారాం నాయక్, పశు సంవర్ధక అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బాలరాజు, బ్లాక్ ఫెలో నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆటో టిప్పర్ లోనే చెత్తను వేయాలి

*** డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా**




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశానుసారము బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం లో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ లోని లాలాపేట్ ఫ్లైఓవర్, విష్ణుపురి కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జ్, తాళ్లబస్తి రైల్వే అండర్ బ్రిడ్జి పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం జరిగినది.కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా మాట్లాడుతూ లాలాపేట్ ఫ్లైఓవర్ పైన ప్లాస్టిక్ కవర్లలో చెత్త తెచ్చి అతివేగంగా వెళుతూ విసిరివేయుచున్నారు అని అలా చేయటం వల్ల పాద చారులకు ఇతర వాహనదారులపై పడి ప్రమాదాలు కూడా సంభవించుచున్నాయని అపరిశుభ్రంగా అసౌకర్యం గా ఉంటుందని, అట్టివారికి భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటికి జిహెచ్ఎంసి వారు ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆటో టిప్పర్ కు తమ ఇంటిలోని చెత్తను అందించి ప్రతి నెల 100 రూపాయలు ఇచ్చినట్లయితే మన నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చుదుకోవచ్చని తద్వారా అంటువ్యాధుల ప్రబలకుండా ఉంటాయన్నారు. బహిరంగ చెత్త ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంత కాలనీవాసులకు అవగాహన కల్పించటం మైకుల ద్వారా నిఘా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం తదితర కార్యక్రమాలు చేపట్టుచున్నట్టు తెలిపినారు రోడ్ల పైన చెత్త , భవన నిర్మాణ వ్యర్థాల వేసిన వారికి భారీ జరిమానాలు విధించుచున్నట్లు తెలిపారు. గత 2 రోజుల పాటు సుమారు 20వేల వరకు జరిమానాలను విధించినట్లు తెలిపినారు, రోడ్లపై చెత్త వేసి వారికి , భవన వ్యర్థాలు వేసిన వారికి జరిమానాలు విధిస్తూనే ఉంటామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీరు మహేశ్వర్, అసిస్టెంట్ ఇంజనీరు మౌనిక, సూపర్వైజర్ శ్రీనివాస్ , జవాన్ యాదగిరి, బుడంపల్లి గిరి,వసంత అలీ నవాజ్ చిట్టిబాబు ప్రభాకర్ శ్రీనివాస్ ఎస్ఎఫ్ఏ తదితరులు పాల్గొని శానిటేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని పర్యవేక్షించినారు



# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు


**: కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఐడీఓసీ నుంచి నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జనవరిలో జిల్లాలో 49 ప్రమాదాలు జరిగి 17 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాద ప్రదేశాలను గుర్తించి గుంతలు, దెబ్బతిన్న రహదారులు, సూచికల లేమి వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి మరమ్మతుల కోసం ప్రత్యేక రిపేర్ గ్యాంగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల్లో రహదారి భద్రత, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్సీసీ విద్యార్థుల ద్వారా హెల్మెట్ వినియోగంపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో బాధితులకు తక్షణ వైద్య సేవలు అందేలా వైద్య శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించి సిగ్నల్ లైట్లు, డివైడర్లు, సూచికలపై నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. జాతీయ రహదారి మరమ్మతులు రెండు వారాల్లో పూర్తి చేయాలని సూచించారు.ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో 38 బ్లాక్‌స్పాట్లు, 62 ప్రమాద ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో ఆర్అండ్‌బి డీఈ నాగేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గాంగ్వార్ ని కలిసిన కార్పొరేటర్

మల్కాజిగిరి ,ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి వాయుపురి కాలనీలో రోడ్లు చాలా కాలంగా దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటంతో, అక్కడ కొత్తగా బీటీ రోడ్లు వేయాలని కమిషనర్ కర్ణన్ కి విజ్ఞప్తి చేయగా, అదే అంశంపై కాలనీ సభ్యులతో కలిసి జోనల్ కమిషనర్ వారికి కూడా ప్రతినిధి బృందం ద్వారా వినతిపత్రం అందజేశారు. డివిజన్‌కు సంబంధించి ఇప్పటికే సమర్పించిన కొత్త ప్రతిపాదనలలో ముఖ్యమైన 4-5 కాలనీల రోడ్లకు బడ్జెట్ మంజూరు చేయాల్సిందిగా కోరడం జరిగింది.ఇంకా, యాప్రాల్ పరిధిలో ప్రకృతి విహార్ నుండి స్వర్ణాంధ్ర వరకు మరియు స్వర్ణాంధ్ర నుండి గోల్ఫ్ లింక్స్ వరకు ఉన్న రెండు ఎస్ ఎన్ డి పి పనులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉండగా, ఇటీవల జోనల్ కమిషనర్ వారు ఈ పనులను స్వయంగా పరిశీలించడం కూడా జరిగింది. ఈ రెండు పనులకు కూడా త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఈటల రాజేందర్ లేఖ ద్వారా ప్రతిపాదించిన పనులకు మంజూరు లభించడంతో, జోనల్ కమిషనర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



# కార్పోరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు కూటమికి విశేష ఆదరణ

*** లభిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రస్తుత కార్పోరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు కూటమికి విశేష ఆదరణ లభిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. 60 డివిజన్ల వ్యాప్తంగా ఎరుపు, పసుపు, నీలి జెండాలు రెపరెపలాడుతున్నాయని అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం దళిత సంఘాల ఐఖ్య సంఘటిత వేదికతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజా శ్రేయస్సే తమ లక్ష్యమని, పదవులు తమకు ముఖ్యం కాదని పేర్కొన్నారు. కార్పోరేషన్ ఏర్పాటుతో పాల్వంచ నుంచి సుజాతనగర్ వరకు అభివృద్ధి వేగవంతమవుతుందని, పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు వచ్చినట్లు చెప్పారు.ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటులో సమన్యాయం పాటించామన్నారు. 12వ వార్డు అభ్యర్థి నాగలక్ష్మి, 13వ వార్డు అభ్యర్థి పి. ఇందిరా ప్రియదర్శిని, 15వ వార్డు అభ్యర్థి కె. సాహితి (కంకి కొడవలి గుర్తు)లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో కూసపాటి శ్రీనివాస్, బొమ్మెర శ్రీనివాస్, రత్నకుమారి, మేదిని లక్ష్మి, బొంకూరి వరమేష్, ఇటికల మొగిలి, దాసరి సారధి, ఎర్ర కామేష్, మాతంగి సంతోష్, పీక కృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు
# ముస్తాబాద్ వాసి నిఖిల్ ఎంపిక



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలానికి చెందిన కాంతుల నిఖిల్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ముస్తాబాద్ గ్రామానికి చెందిన కాంతుల బాలయ్య కుమారుడైన నిఖిల్, ఈ నెల 2వ తేదీన జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకున్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడా పోటీలలో నిఖిల్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన నిఖిల్‌ను జిల్లా క్రీడా అధికారి అజ్మీర రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నమనేని శ్రీ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామానికి చెందిన యువకుడు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలపై బిఆర్ఎస్ సమీక్షా సమావేశం



సంగారెడ్డి ,ప్రజాస్ఫూర్తి : సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డులకు సంబంధించిన వార్డు ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులతో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీకి సంబంధించిన రాజకీయ, సంస్థాగత పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. స్థానిక శాసనసభ్యులు చింత ప్రభాకర్ సంగారెడ్డి జిల్లా సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ వార్డు స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఇన్‌చార్జ్ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటికి తక్షణ పరిష్కారాలు చూపేలా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ,డాక్టర్ శ్రీహరి యాదవ్, నంగునూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి పాల్గొన్నారు. వేదికపై క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

# అధికార పార్టీతోనే.. అభివృద్ధి సాధ్యం

*** కాంగ్రెస్ పార్టీ 5వ వార్డు అభ్యర్థి కొండూరు ధర్మేందర్ గౌడ్ కు అవకాశం ఇవ్వండి**

*** సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అధికార పార్టీ కాంగ్రెస్ తోనే.. చౌటుప్పల్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం 5వ వార్డుకు ఎన్నికల ఇన్చార్జ్ గా వ్యవహరిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి, యువ నాయకుడు కొండూరు ధర్మేందర్ గౌడ్ కు అవకాశం కల్పించాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం తపించే వ్యక్తిని ఆదరించాలన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా వార్డు అభివృద్ధి కోసం పరితపించే వ్యక్తి ధర్మేందర్ గౌడ్ అన్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తూ, కౌన్సిలర్ అభ్యర్థిగా ఎన్నిక కావడం ధర్మేందర్ కష్టానికి దక్కిన ఫలితం అన్నారు. వృద్ధుల కోసం, గ్రామస్తుల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేశాడని గుర్తు చేశారు. వార్డు అభివృద్ధి జరగాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ, అధికార పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తోనే సాధ్యమవుతుందన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కొండూరు ధర్మేందర్ గౌడ్ ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గురువారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గురువారం సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో 50 కుటుంబాల చేరిక

* **అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలి : ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సిపిఐలో ప్రకాష్‌నగర్‌కు చెందిన 50 కుటుంబాలు చేరాయి. పల్లపు సాగర్, పల్లవు విజయ్‌కుమార్, బోదాసు రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎర్రకండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. రాబోయే కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు.పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కూనంనేని చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై సిపిఐలో చేరినట్లు తెలిపారు. కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి..
## సేవకురాలిగా అభివృద్ధి చేస్తా

* **15వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం ఇందిర రాజారత్నం**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆదరించి ఆశీర్వదిస్తే.. సేవకురాలిగా పనిచేస్తూ.. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బిఆర్ఎస్ 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గడ్డం ఇందిర రాజారత్నం అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం 15వ వార్డులో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా గడ్డం ఇందిర రాజారత్నం మాట్లాడుతూ తనకు ఓటు వేసి అవకాశం కల్పిస్తే 15వ వార్డును చౌటుప్పల్ మున్సిపాలిటీలోనే అగ్రగామిగా అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో బరిలోకి దిగి ఓటమిపాలైనప్పటికీ, ప్రజలకు ఏనాడు దూరంగా లేనన్నారు. పదవులతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమై పనిచేస్తున్నానన్నారు. మరల మీ ముందుకు వచ్చానని కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అరిగె కిష్టయ్య, వార్డు అధ్యక్షుడు ఊదరి కిషోర్, బీఆర్ఎస్, సిపిఎం నాయకులు సిలివేరు జంగయ్య, మొగుదాల రాములు, దాసరి ప్రకాష్, సిలువేరు నరసింహ, సిలివేరు గాలయ్య, ఊదరి బాబురావు, సిలువేరు రాములు ఊదరి అశోక్, సిలివేరు ముత్యాలు, ప్రవీణ్, సుభాష్, నవీన్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# రెబల్స్‌తో ప్రధాన అభ్యర్థుల్లో గుబులు

* **చాపకింద నీరులా ప్రచారం**
* **ఫలితాలు తారుమారయ్యే సూచనలు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల వేళ ప్రధాన పార్టీలకు తిరుగుబాటు అభ్యర్థుల సెగ తగులుతోంది. టికెట్ ఆశించి చివరి దశలో నిరాశ చెందిన నేతలు స్వతంత్రులుగా బరిలో నిలవడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సిపిఐ పార్టీల కండువాలు కప్పుకుని ప్రచారం నిర్వహించిన పలువురు నేతలు, అధిష్టానం నుంచి టికెట్ దక్కకపోవడంతో రెబల్స్‌గా మారి అధికారిక అభ్యర్థులకు సవాల్ విసురుతున్నారు. దీంతో ఆయా పార్టీల్లో అసంతృప్తి స్వరం వినిపిస్తోంది. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉండగా అందులో 58 డివిజన్లకు బీఆర్ఎస్, 2 డివిజన్లలో సిపిఎం కలిసి పోటీ చేస్తుండగా, 59 డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది. అదేవిధంగా సీపీఐ సైతం కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో ఒంటరిగానే పోటీకి దిగింది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో సుమారు 20 మందికి పైగా ఆయా పార్టీల తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో ఉండటంతో ఓట్ల చీలికపై ప్రధాన పార్టీల్లో ఆందోళన నెలకొంది. గెలుపు అవకాశాలు ఉన్న డివిజన్లలో రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటం పార్టీల అగ్రనేతలకు తలనొప్పిగా మారింది. ఇప్పటికే బుజ్జగింపు పర్వాలు నడిచినప్పటికీ పార్టీని నమ్ముకుని ఇంతకాలం పనిచేసిన తమకు టికెట్ ఇవ్వకపోవడంతో పోటీలో ఉండక తప్పదని కొందరు ఘంటాపథంగా చెప్తున్నారు. ఇంకొందరు రెబల్స్ తమకు ప్రజల్లో మంచిపేరు ఉందని, తప్పక గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**చాపకింద నీరులా ప్రచారం...**

నామినేషన్ ముందు నుండే పార్టీ గుర్తులతో ఓట్లు అభ్యర్థించిన పలువురు టికెట్లు ఆశించిన అభ్యర్థులు ప్రస్తుతం స్వతంత్రులుగా పోటీలో ఉండటంతో ఓటర్లను నేరుగా కలుస్తూ చాపకింద నీరులా ప్రచారం కొనసాగిస్తున్నారు. గతంలో తాము చేసిన అభివృద్ధిని గుర్తుంచుకుని ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా స్థానికంగా తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించుకుంటూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. నమ్ముకున్న పార్టీలు మోసం చేశాయంటూ ఓటర్ల వద్ద సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. కాగా ఆయా పార్టీల అధిష్టానవర్గాలు మాత్రం రెబల్స్‌గా పోటీ చేసే వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరిస్తూనే వారిని బుజ్జగించి పోటీ నుంచి తప్పుకునేలా మంత్రులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. రెబల్స్ పోటీలో నిలిస్తే మాత్రం పార్టీల అంచనాలు ఫలితాల్లో తారుమారయ్యే అవకాశాలు లేకపోలేదు.

**మున్సిపాలిటీల్లోనూ ఇదే సీన్..**

కొత్తగూడెం కార్పొరేషన్‌తోపాటు ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొందరు నేతలు బహిరంగంగానే పార్టీ పెద్దలపై విమర్శలు చేస్తూ, టికెట్ విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారు. తిరుగుబాటు అభ్యర్థుల ప్రభావం పెరిగితే ఈసారి గెలుపోటముల అంచనాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా నిన్న మొన్నటి వరకు మాకే టికెట్ వస్తుందని ఆశించి భంగపడిన నేతలు కొందరు ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నారు. వారు ఎవరికి మద్దతు ఇస్తారు అనేది ప్రశ్నార్థకంగా ఉండటంతో పార్టీల తరపున పోటీలో నిలిచిన వారు ఫలితాలపై ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా ఈదఫా ఎన్నికలు మొదటి నుంచి రసవత్తరంగా ఉన్నాయని ఓటర్లు చర్చించుకుంటున్నారు.



## డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా
# ముందుకు వెళుతున్నాం

* **అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. అల్విన్ కాలనీ డివిజన్ శంషిగూడ పరిధిలోని ఛత్రపతి శివాజీ నగర్, అనసూయమ్మ మహంకాళినగర్, ఇంద్రహిల్స్, మహంకాళి నగర్, కాలనీలలోని పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు , కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పర్యటించిన కాలనీలలో కొంతమేర డ్రైనేజీ ,సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి . సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీలలో కొన్నిచోట్ల డామేజ్ అయిన మన్ హోల్ మూతలను వెంటనే మార్చి కొత్తవి అమర్చాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. కాలనీలలో స్ట్రీట్ లైట్స్, డ్రైనేజీ ఓవర్ ఫ్లో, పారిశుధ్యనికి సంబంధించి సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ కి వివరించగా, కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీ వాసులు తెలియచేసిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, గోపాల్, వెంకట్ నాయక్, అంజయ్య యాదవ్, ఎం.శ్రీనివాస్, నిరంజన్, లాలన్, యాదవ్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, రాజు, శ్యామ్, లక్ష్మి, నాయకులు, మహిళలు, కాలనీ వాసులు, జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యుబీడి నాగరాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్వైజర్లు శ్రీనివాస్ , శివ, స్ట్రీట్ లైట్స్ సూపర్వైజర్ నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా



* **5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండూరు ధర్మేందర్ గౌడ్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా తనకు ఓటు వేసి ఆదరించి ఆశీర్వదిస్తే.. వార్డును అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండూరు ధర్మేందర్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం 5వ వార్డులో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ అమ్మ, అక్క, అన్న, తమ్ముడు అంటూ ఆప్యాయంగా పలకరించుకుంటూ తనను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కొండూరు ధర్మేందర్ గౌడ్ మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీర్వాదంతో 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలోకి దిగానన్నారు. ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తూ, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రోల్ మోడల్ గా తీసుకొని, చౌటుప్పల్ మున్సిపాలిటీలోనే 5వ వార్డును ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గట్టు వెంకటేష్, నక్క వెంకటేష్, బొలమోని రంగయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రాజు, చిత్రాల నరసింహ, అనమోని వెంకటేష్, శ్యామల అనిల్, చిత్రాల రాజు, బొలమోని నరేందర్, బైరు సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం 11 వ వార్షికోత్సవం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీ నగర్ లో గల శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం 11 వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యువజన నాయకులు జల్దా లక్ష్మి నాథ్, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు మంజల చింతయ్య, హనుమయ్య, నవీన్, తిమ్మయ్య, సాయి గౌడ్, రాము,శ్రీధర్, నీలగిరి, విజయ్,తోకల శ్రీను, సురేష్, ఆనంద్, సాయి, అప్పారావు పాల్గొన్నారు.

## ఆదరించండి..
## అభివృద్ధితో నిరూపించుకుంటా

* **6వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి ఆలె శ్రీలత చిరంజీవి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తనను ఆదరించి ఓటు వేసి ఆశీర్వదిస్తే.. వార్డును అభివృద్ధి చేసి నిరూపించుకుంటానని 6వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి ఆలె శ్రీలత చిరంజీవి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం 6వ వార్డులో గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వార్డులోని వీధులన్నీ కలియ తిరుగుతూ, మహిళలతో ర్యాలీగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మహిళలను, వృద్ధులను కలిసి ఆప్యాయంగా మాట్లాడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆలె శ్రీలత చిరంజీవి మాట్లాడుతూ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ముఖ్యంగా బరిలోకి దిగానన్నారు. తనకు సహకరించి ఓటు వేసి గెలిపిస్తే వార్డును కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేస్తానన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల జనార్ధన్, తొర్పునూరి లక్ష్మణ్, కర్తాల శ్రీను, గుండెబోయిన వేణు, జెట్ట ముత్యం, చీకూరి సాయిరాం, వర్కాల సురేష్, కేతరాజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ఆచారాలకు అద్దం పట్టిన సమ్మక్క–సారక్క జాతర

* **ప్రశాంత్ నగర్‌లో భక్తి, సంప్రదాయాల సందడి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ప్రశాంత్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆదివాసీ నగర్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరలో స్థానిక గిరిజనులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో ఆరాధించారు.జాతర సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. సంప్రదాయ వేషధారణలో గిరిజన మహిళలు, యువతులు నృత్యాలతో అలరించగా, పురుషులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు బంగారం (బెల్లం), కొబ్బరికాయలు, పూలతో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. డోలు, తాసా మేళాలతో ఊరంతా భక్తి పరవశంలో మునిగిపోయింది.గిరిజనుల విశ్వాసాల ప్రకారం సమ్మక్క-సారలమ్మలు ధైర్యం, త్యాగానికి ప్రతీకలుగా భావిస్తారు. కష్టసమయాల్లో తమకు అండగా నిలిచే దేవతలుగా అమ్మవార్లను కొలుస్తారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ జాతర గిరిజన సంప్రదాయాలను కాపాడటమే కాకుండా యువతకు సంస్కృతి, ఆచారాలపై అవగాహన కల్పిస్తోంది.జాతర నిర్వహణలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు సమన్వయంతో పనిచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ప్రసాదం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆదివాసీ నగర్ సందడిగా మారింది.సమ్మక్క-సారలమ్మ జాతర కేవలం పండుగ మాత్రమే కాకుండా, గిరిజనుల ఐక్యత, సంప్రదాయాల ప్రతీకగా నిలుస్తుందని స్థానికులు తెలిపారు.



ఇటువంటి జాతరలు గిరిజన సంస్కృతిని సంరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందు 14వ నంబర్ బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ కమల్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఆరు నెలల క్రితం భార్య మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన కమల్ ఆరోగ్యం క్షీణించినట్లు తెలిసింది. ఆయన మృతిపై జగదంబ సెంటర్ ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

## మౌలాలి కి కొత్తగా నియమితులైన డిప్యూటీ కమిషనర్ కు ఘన సన్మానం



మల్కాజిగిరి , ప్రజాస్ఫూర్తి : వినాయక్ నగర్ ఈ మధ్యకాలములో కొత్త సర్కిల్ మౌలాలి కి నియమితులైన డిప్యూటీ కమిషనర్ గోపాల్ రావు ని వినాయకనగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయనతో కాకతీయ నగర్ పార్కు సమస్యలు, టౌన్ ప్లానింగ్ , పారిశుధ్య సమస్యల గురించి చర్చించి, తగినంత మంది సిబ్బంది లేక వారు పని నిర్వహణలో లోపం కనిపిస్తుందని, ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు ఓం ప్రకాష్, సాయిశురేష్, కాకతీయనగర్ కాలనీ అధ్యక్షులు బాల స్వామి, మెంబెర్ కృష్ణ పాల్కొన్నారు.

## ఇంటింటి ప్రచారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : మెదక్ మున్సిపాలిటీలో 6,7,8వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందిస్తున్నారని ప్రచారంలో వివరించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం వల్లే మెదక్ అభివృద్ధి కుంటుపడిందని ఆరోపంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 200 కోట్ల రూపాయలు మెదక్ అభివృద్ధికి కేటాయించమని తెలిపారు. మెదక్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాలిటీ చైర్మెన్ చంద్రపాల్, మ్యడం బాలకృష్ణ,పట్టణ అధ్యక్షులు గంగాధర్, మున్సిపాలిటీ కౌన్సిలర్స్ అభ్యర్థులు, హరిత నర్సింగరావు, ఆరిఫ్ అంజద్, జయశ్రీ,నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ తో సమానంగా.. చౌటుప్పల్ ను అభివృద్ధి చేస్తా

**: మున్సిపల్ పరిధిలోని 1, 2, 3, 9, 10, 11, 12 13, 19వార్డుల్లో ముమ్మర ప్రచారం**

*** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: హైదరాబాద్ ప్రాంతంతో సమానంగా చౌటుప్పల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 1, 2, 3, 9, 10, 11, 12 13, 19వార్డుల్లో గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మొదటగా ఎమ్మెల్యే చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 19వ వార్డుకు చేరుకున్నారు. వార్డులోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 19వ వార్డు నుంచి ప్రచారాన్ని నిర్వహించారు. 19వ వార్డులో ప్రారంభమైన ప్రచారం వరుసగా 9, 10, 11, 12వార్డుల్లో నిర్వహించారు. అనంతరం భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం 13వ వార్డు నుంచి 1, 2వార్డుల మీదుగా, 3వ వార్డులో ప్రచారాన్ని ముగించారు. ఆయా వార్డుల్లో మహిళల్లో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి హారతితో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నడుచుకుంటూ వెళ్లి మహిళలను, వృద్ధులను పలకరించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదుకు అతి దగ్గరలో ఉన్న చౌటుప్పల్ ప్రాంతం వెనుకబాటుకు గురైందని, ఎల్బీనగర్ మాదిరిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపిస్తే, ప్రభుత్వం నుంచి కొట్లాడి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కారులో తిరిగితే డీజిల్ కూడా వృధా అని ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు పిల్లలమర్రి మధుసూదన్, మొగుదాల పావని రమేష్ గౌడ్, దేప రమ్య రాజు ముదిరాజ్, గోశిక వినయ్, పాక చిరంజీవి, బత్తుల వాణి విప్లవ్ కుమార్, కొసనం రాకేష్ రెడ్డి, సుర్వి మంజుల నరసింహ గౌడ్, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చెరుకు స్వాతి శివ గౌడ్ గెలుపు.. వార్డు అభివృద్ధికి మలుపు

*** 13వ వార్డులో ర్యాలీ, ప్రచారం**

*** మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి పార్టీ 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చెరుకు స్వాతి శివ గౌడ్ గెలుపు.. వార్డు అభివృద్ధికి కీలక మలుపుగా మారుతుందని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డులో బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి స్వాతి గురువారం ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా రామ్ నగర్ లో ప్రారంభమైన ర్యాలీ, కృష్ణానగర్ మీదుగా సర్వీస్ రోడ్డు వెంట పద్మశాలి కాలనీ వరకు నిర్వహించారు. ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరయ్యారు. అభ్యర్థితో పాటు ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు, వృద్ధులు, యువత నుంచి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బేతి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ చదువుకున్న యువతకు రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశంతోనే చెరుకు స్వాతి శివ గౌడ్ కు అవకాశం ఇచ్చామన్నారు. వార్డు ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. 13వ వార్డు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, వార్డు అభివృద్ధి మీ చేతుల్లోనే ఉందన్నారు. బిజెపి అభ్యర్థి చెరుకు స్వాతి శివ గౌడ్ ను గెలిపించుకుంటే వార్డు స్వరూపం మారుతుందన్నారు. వార్డు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి చెరుకు స్వాతి శివ గౌడ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, బీజేవైఎం నాయకులు దిండు భాస్కర్, పబ్బు వంశీ, నాయకులు మార్గం స్వామి యాదవ్, ఉష్కాగుల శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## 36వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థిగా గంట్ల అనంతరెడ్డి విస్తృత ప్రచారం

ప్రజా స్ఫూర్తి నల్లగొండ: నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 36 వ డివిజన్లో స్వతంత్ర అభ్యర్థిగా గంట్ల అనంతరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ ఆలోచనలు లేని నాకు ప్రముఖ భారతీయ జనతా పార్టీ నాయకులు సంప్రదించి ఇంటికి వచ్చి మీ సేవలు పార్టీకి ఎంతో అవసరం అని నమ్మబలికి ఆధ్యాత్మిక సేవలో ఉన్న నాకు రాజకీయ రంగు పూసి చివరి నిమిషంలో ప్లేటు పిరాయించి ఆదిపత్య రాజకీయం చేశారు... రాజకీయాలకు అతీతంగా అందర్నీ సమన్వయపరచుకొని 20 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సేవలో రుద్రసేన ఆధ్వర్యంలో నల్లగొండ ఐకాన్ శ్రీ ఛాయాసోమేశ్వర స్వామి దేవాలయం అందరి సహకారంతో అభివృద్ధి చేయడం జరిగింది. ఇప్పుడు కూడా నల్లగొండలో ఉన్న అన్ని డివిజన్లలో 36వ డివిజన్ కు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా నేను శ్రమిస్తానని నాపై నమ్మకం ఉంచి ఇప్పుడు జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే ఆధునీకరత చెందిన 36 డివిజన్ తథ్యం అని తెలియజేశారు. తన గుర్తు విజిల్ మరియు సీరియల్ నెంబర్ 6 అని తెలియజేశారు. డివిజన్ అభివృద్ధి ధ్యేయంగా విడుదల చేసిన మేనిఫెస్టో కచ్చితంగా అమలు చేస్తానని తెలియజేశారు..

*** విడుదల చేసిన మేనిఫెస్టో వివరాలు..**

- ప్రతి కాలనీలో ఒక అభివృద్ధి కమిటీ ఏర్పరిచి వారి సూచనల మేరకు డివిజన్ ని అభివృద్ధి పరచుట. అందరికీ అందుబాటులో నూతన ఆఫీస్ మరియు 24 గంటలు వార్డ్ వాలంటీర్స్ ని నియమించుట. డివిజన్ సమస్యలు పరిష్కారం కొరకు ప్రత్యేక డిజిటల్ యాప్.
- పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పెద్ద మొత్తంలో మొక్కల పెంపకం.
- ఆర్థికంగా వెనుకబడి మరియు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు డిపి షుగర్ ఉచిత మందుల పంపిణీ.

ఉద్యోగ అవకాశాల కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉచిత స్టడీ హాల్. ఉచితంగా ధ్యాన, యోగ కేంద్ర సదుపాయం. ఉచిత కోలాటం, భజన మరియు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ లో నిర్వహణ.నిరుద్యోగ యువతకు కెరీర్ గైడెన్స్. రాత్రిపూట పెట్రోలింగ్ వెహికల్ స్వంత నిధులతో ఏర్పరచుట. ఏర్పాటు చేస్తానని తెలిపారు..

## వింతలోకం..? విచిత్రజీవితం..?



రచన: కవి రత్న
సాహిత్య ధీర సహస్ర కవి భూషణ్
**పోలయ్య కూకట్ పల్లి**
అత్తాపూర్ హైదరాబాద్

విధినాటిన విత్తనం...
తొలి పరిచయం...
ఎండమావిలా భ్రమింపజేసి
మాయ...తొలి బంధం...

గుండెను పదునైన
కత్తుల్లా గాయపరిచేవి...
కసి కక్ష ద్వేషం...
కదిలే మేఘాల్లా
కనుమరుగైపోయేవి కరుణ
జాలి దయ...మమకారం...

నిర్మలమైన
నీలాకాశంలా
నిలిచేది...స్నేహం...
స్వచ్ఛమైన మనసున
పుష్పంలా పరిమళించేది...
ప్రేమ

గాలిలో మేడలా తృటిలో
కుప్ప కూలిపోయేది...ఆశ...

విషసర్పంలా
స్నేహ ప్రేమ బంధాల్ని
కలుషితం చేసేది కాటేసేది...
స్వార్థం...
అర్థంకాని మాయాజాలం...
ఈలోకం...
శాశ్వతమైన వెలుగులా నీకు
నిత్యం తోడుగా నీడగా ఉండే
నీ రక్షణ కవచం...దయగల ఆ
దైవమే...

## 'ఉపాధి హామీ' లేకుండా చేసేందుకు కుట్ర: భట్టి



చెన్నై: ఉపాధిహామీ పథకంలో మార్పులుచేసి.. ఆ పథకం ఉనికి లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తిరిగి పెట్టేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఉపాధిహామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీ శ్రేణులు చెన్నైలో పాదయాత్ర నిర్వహించాయి. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో భట్టి విక్రమార్క పాల్గొని ప్రసంగించారు. పథకం నుంచి మహాత్మాగాంధీ పేరు తొలగించడానికి కారణం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తుచేశారు. దేశంలో కోట్లమంది జీవితాల్లో మార్పు తెచ్చిన ఉపాధి హామీ పథకం నిశ్శబ్ద విప్లవమని, దీనిని నీరుగారనివ్వబోమని తెలిపారు. తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఏఐసీసీ నేత గిరీష్ చొడాంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏ పన్నులూ పెంచే ఆలోచన లేదు

*** ఓట్ల కోసం భాజపా ఆరోపణలు**

*** రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు**

ఆస్తి పన్ను, నల్లా బిల్లు వంటి పన్నులేవీ పెంచే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని, ఓట్ల కోసమే భాజపా నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం రాత్రి కరీంనగర్ నగరపాలికలో జరిగిన కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం వద్ద పన్నుల పెంపుపై ఎలాంటి ప్రతిపాదన లేదు. కేంద్ర ప్రభుత్వమే పన్నులు పెంచింది. భారాస, భాజపా ప్రభుత్వాలు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించి, ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పన్నులు పెంచకుండా, అభివృద్ధి పనులు చేపడుతోంది. సంక్షేమ కార్యక్రమాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.కోట్లు ఖర్చు చేశాం. కరీంనగర్ మేయర్ స్థానాన్ని గెలుచుకొని వాటిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం. దేశంలోని అనేక రాష్ట్రాలకు పూర్తిస్థాయి నిధులు కేటాయిస్తున్న భాజపా ప్రభుత్వం, కరీంనగర్‌లోని డంపింగ్‌యార్డుకు మాత్రం మంజూరు చేయడం లేదు' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రచారంలో ఎమ్మెల్యేలు సత్యనారాయణ, మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసమే.. తొర్పునూరి నర్సింహ్మా గౌడ్ విత్ డ్రా

**: బత్తుల వాణి విప్లవ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వార్డు అభివృద్ధి కోసమే.. తొర్పునూరి శోభ నర్సింహ్మా గౌడ్ నామినేషన్ విత్ డ్రా చేసుకున్నారని కాంగ్రెస్ పార్టీ 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బత్తుల వాణి విప్లవ కుమార్ స్పష్టం చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డులో ప్రచారానికి ముఖ్యఅతిథిగా గురువారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. వార్డు మహిళలు ఎమ్మెల్యేకు హారతితో స్వాగతం పలికారు. భాస్కర్ టాకీస్ నుంచి ఎమ్మెల్యే సీసీ రోడ్డు వెంట ఇంటింటికి తిరుగుతూ, ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ప్రచార రథంపై ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. చెయ్యి గుర్తుకు ఓటు వేసి బత్తుల వానికి విప్లవకుమారును గెలిపించాలని కోరారు.

*** మంచి మనిషి పై నిందలు వేయడం బాధగా ఉంది**

**- బత్తుల విప్లవ్ కుమార్**

చౌటుప్పల్ రెండవ విడత మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తొర్పునూరి నరసింహ గౌడ్ తన సతీమణి శోభతో నామినేషన్ వేయించాడన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బత్తుల తన సతీమణి వాణి బరిలో నిలవడంతో, 13వ వార్డు అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలనే సదుద్దేశంతోనే తొర్పునూరి నరసింహ గౌడ్ స్వచ్ఛందంగా విత్ డ్రా చేసుకున్నాడని స్పష్టం చేశారు. కానీ, ఇదంతా తెలియని ప్రజలు మంచి మనిషిని నిందిస్తున్నారని బాధపడ్డారు. 13వ వార్డు సమస్యల వలయంగా ఉందని, ఈ సమస్యలన్నీ పరిష్కరించి, వార్డును అన్ని రంగాలు అభివృద్ధి చేయాలంటే రాజకీయ శత్రువులుగా కాకుండా ఆత్మీయ మిత్రులుగా మెసులుకోవాలని, అందుకు తానే ఒక అడుగు ముందుకు వేసి విత్ డ్రా చేసుకున్నాడన్నారు. అంతేకానీ, తనపై వస్తున్న అవాస్తవమైన నిందలు ఎవరూ పట్టించుకోవద్దన్నారు. అదేవిధంగా వార్డు అభివృద్ధి ధ్యేయంగా బిజెపి నుంచి అభ్యర్థి విత్ డ్రా చేసుకున్నాడని, టిడిపి నుంచి సైతం అభ్యర్థి విరమించుకున్నట్లు ప్రజలకు స్పష్టం చేశారు. వారి త్యాగాలను అర్థం చేసుకోవాలి కానీ, అవాస్తవమైన నిందలను మోపి వారిని, వారి కుటుంబ సభ్యులను మానసికంగా వేధించొద్దని వేడుకున్నారు.

# కంచె నిర్మాణానికి భూమి కేటాయిస్తాం.. కానీ: మమతా బెనర్జీ

పశ్చిమ బెంగాల్‌లో బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం కేంద్రానికి భూమి ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని సీఎం మమతా బెనర్జీ తెలిపారు. అయితే.. రాష్ట్రంలో బీఎస్‌ఎఫ్ అధికార పరిధిని పెంచుతూ గతంలో ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం ముందుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశంలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా దీదీ ఈమేరకు మాట్లాడారు. కంచె ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని కేంద్రం, భాజపా చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ''దేశ భద్రతకు కట్టుబడి ఉన్నాం. కంచె విషయంలో భూమి అనేది సమస్య కాదు. అవసరమైనంత మేరకు కేటాయిస్తాం. కానీ, ముందుగా బీఎస్‌ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్లకు పెంచుతూ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని మార్చండి. రైల్వేల నుంచి రక్షణ వరకు అనేక కేంద్ర విభాగాలకు భూమి కేటాయింపు విషయంలో సహకరించాం. ఫెన్సింగ్ విషయంలో కేంద్రం కొన్ని వాస్తవాలనే ప్రజల ముందు ఉంచుతోంది. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని కేటాయించిందనే దానిపై కేంద్రమంత్రి అమిత్ షా ఎక్కడా వివరాలు వెల్లడించడం లేదు'' అని మమతా బెనర్జీ విమర్శించారు. బెంగాల్‌లో చొరబాట్లనేవీ ముప్పుగా పరిణమించాయని, కంచె కోసం భూమి కోరుతూ కేంద్రం చాలాసార్లు లేఖలు రాసినప్పటికీ ఫలితం లేకపోయిందని



ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఆరోపించారు. అయితే.. చొరబాట్లు, రోహింగ్యాల విషయంలో సాక్ష్యాలను చూపించాలని భాజపాకు ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. పాలన విషయంలో తాను పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఫెన్సింగ్ కోసం ఇప్పటికే కేటాయించిన భూమిలో ముందుగా పనులు పూర్తి చేయాలని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అనేక సీట్లు కోల్పోతుందన్నారు.

## రూ.49 కోట్ల లాటరీ..
# కన్నడ యువకుడికి జాక్‌పాట్

ఓ ప్రవాస భారతీయుడికి లాటరీ రూపంలో అదృష్టం వరించింది. తన స్నేహితుడితో కలిసి అబుధాబీ బిగ్ టికెట్‌లో దాదాపు రూ.49 కోట్లు గెలుచుకున్నాడు. కర్ణాటకలోని ఉడుపికి చెందిన శంతను శెట్టిగర్ (33).. మస్కట్‌లో రిటైల్ రంగంలో పనిచేస్తున్నాడు. తన స్నేహితుడితో కలిసి బిగ్ టికెట్ లాటరీ కొనుగోలు చేశాడు. ఇటీవల డ్రా తీయగా.. అతడి టికెట్ నంబర్ వచ్చింది. ఊహించని జాక్‌పాట్‌పై అతడు ఆనందం వ్యక్తం చేశాడు. మరోవైపు.. ఈ విషయం తెలియగానే ఉడుపిలోని శంతను ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది.



# ముంబయి టీచర్‌కు రూ. 9 కోట్ల ప్రైజ్‌మనీ

భారత్‌కు చెందిన ఉపాధ్యాయురాలు రూబల్ నాగీ ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ టీచర్ ప్రైజ్' అందుకున్నారు. దుబాయ్‌లో జరిగిన వరల్డ్ గవర్నమెంట్స్ సమిట్‌లో ఆమె దీనిని స్వీకరించారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా వందలాది విద్యా కేంద్రాలు ఏర్పాటుచేయడం, పెయింటింగ్‌ల ద్వారా మురికివాడల్లో చిన్నారులకు విద్య అందించేందుకు కృషి చేసినందుకు నాగీకి ఈ గుర్తింపు లభించింది. దీని ద్వారా రూ.9 కోట్ల ప్రైజ్ మనీని నాగీ అందుకున్నారు. ముంబయికి చెందిన రూబల్ నాగీ.. రూబల్ నాగీ ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 800



విద్యాకేంద్రాలు ఏర్పాటు చేశారు. పాఠశాలలకు వెళ్లని చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడమే లక్ష్యంగా ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితోపాటు బడికెళ్లే పిల్లలకూ విద్యను అందిస్తున్నారు. సైన్స్, గణితం, చరిత్రతోపాటు ఇతర అంశాలను నేర్పించేందుకు గోడలపై చిత్రాలను గీసే విధానాన్ని పాటిస్తున్నారు. గ్లోబల్ టీచర్ ప్రైజ్ అందుకున్న నాగీ.. ఇది తనతోపాటు భారత్‌కు దక్కిన గౌరవమన్నారు. 24 ఏళ్ల క్రితం 30 మంది చిన్నారులతో కలిసి తన ప్రయత్నాన్ని మొదలుపెట్టానని.. ఇప్పుడు లక్షలాది మంది ఇందులో భాగస్వామ్యమయ్యారని చెప్పారు. దేశంలోని ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించేందుకు చేసిన ప్రతి ప్రయత్నం తనకెంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ ప్రైజ్ మనీతో ఉచిత ఒకేషనల్ ట్రైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. ఈజిప్టు, ఖతార్, యూఏఈలలో పలు విద్యా సంస్థలను నడిపిస్తోన్న జీఈఎంఎస్ ఎడ్యుకేషన్.. 'వర్కీ ఫౌండేషన్' పేరుతో స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తోంది. సమాజంలో అణగారిన వర్గాల పిల్లలకు విద్యను అందించేందుకు రూబల్ నాగీ కృషి చేస్తున్నారని, ఇది వారి జీవితాలను మార్చడమే కాకుండా కుటుంబాల్లో మార్పు తెస్తుందని ఈ సందర్భంగా వర్కీ ఫౌండేషన్ పేర్కొంది.

# గ్యాంగ్‌స్టర్ అబూసలేంకు పెరోల్ నిరాకరణ

ముంబయి పేలుళ్ల ఘటన (1993)లో కీలక సూత్రధారి అబూసలేంకు బాంబే హైకోర్టులో ఊరట లభించలేదు. తన సోదరుడి మరణం నేపథ్యంలో 14 రోజుల పెరోల్ కోరుతూ చేసిన దరఖాస్తును కోర్టు కొట్టివేసింది. పోలీస్ ఎస్కార్ట్ ఛార్జీలు చెల్లించలేనని చెప్పడంతో పెరోల్‌ను నిరాకరించింది. రూ.లక్షలోపు మాత్రమే పోలీసు ఎస్కార్ట్ ఛార్జీలను



నిందితుడు చెల్లించగలడని అతడి తరఫు న్యాయవాది గతంలో కోర్టుకు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన నివాస ప్రాంతానికి వెళ్లాలనుకుంటే ప్రభుత్వం కోరిన ఎస్కార్ట్ ఛార్జీలు చెల్లించాల్సిందేనని, లేదంటే పెరోల్ ఇవ్వడం కుదరదని న్యాయస్థానం స్పష్టంచేసింది. ముంబయి పేలుళ్లు, బెదిరింపులు, హత్య కేసుల్లో 2015లో అతడికి జీవిత ఖైదు పడింది. నాటి నుంచి మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. మరోవైపు అబూసలేంకు పెరోల్ ఇస్తే పారిపోతాడని మహారాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

# RAC కింద బెర్త్ లభించకుంటే..
# టికెట్ ఛార్జీలో కొంత తిరిగివ్వాలి!

రైలు ప్రయాణంలో ఆర్‌ఏసీ కేటగిరి కింద బుక్ చేసుకున్న టికెట్లకు పూర్తి ఛార్జీ వసూలు చేయడం సమర్థనీయం కాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఆర్‌ఏసీలోనే ఉండి బోర్డింగ్ సమయంలో బెర్త్ లభించని ప్రయాణికులకు ఛార్జీలో కొంత మేర తిరిగి ఇవ్వాలని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ''పంక్చువాలిటీ అండ్ ట్రావెల్ టైమ్ ఇన్ ట్రైన్ ఆపరేషన్స్ ఇన్ ఇండియన్ రైల్వేస్'' పేరుతో పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో ప్రజాపద్దుల కమిటీ పేర్కొంది. ప్రస్తుతం ఆర్‌ఏసీ కింద బెర్త్ బుక్ చేసుకునే ప్రయాణికుల నుంచి పూర్తి మొత్తంలో టికెట్



ఛార్జీ వసూలు చేస్తున్నారు. ఇదే కేటగిరి కింద ఉండే మరో ప్రయాణికుడితో బెర్త్ పంచుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇద్దరు ప్యాసింజర్లు పూర్తి మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఇలాంటి ప్రయాణికులకు టికెట్‌లో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించాలని, ఇందుకు సంబంధించి తీసుకున్న చర్యలను తెలియజేయాలని పార్లమెంటరీ కమిటీ ఆదేశించింది.

## ఎన్నికలకు ముందు 'ఉచిత' హామీలపై పిల్..
## విచారణకు సుప్రీం అంగీకారం

ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఎక్కువగా ఉచితాల వైపే దృష్టిసారిస్తాయి. ఈ ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. తాజాగా దాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అందులో ఎన్నికలకు ముందు అసంబద్ధమైన 'ఉచిత' హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల గుర్తులు, వాటి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని ఆయన కోరారు. తన పిల్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఓటర్లను



ప్రభావితం చేస్తాయని.. ఇది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఓ చట్టాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. ధర్మాసనం దీన్ని తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ.. దీనిపై మార్చి చివరిలో విచారణ జరిపేందుకు అంగీకరించింది.


# చమురు కొనుగోళ్లు.. 140 కోట్లమంది ఇంధన భద్రతకే ప్రాధాన్యం

**: విదేశాంగశాఖ**

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు నిలిపేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి దిగుమతి చేసుకుంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ అంశంపై భారత విదేశాంగశాఖ స్పందించింది. 140 కోట్లమంది దేశ ప్రజల ఇంధన భద్రతే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని, చమురు సేకరణ విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇదే మూలమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా విభిన్న సరఫరాదారులను ఆశ్రయించడం అనేది ప్రభుత్వ వ్యూహంలో భాగమని పేర్కొంది. ''వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో



వెనెజువెలా చాలా కాలంగా భారత్ భాగస్వామిగా ఉంది. గతంలో ఆ దేశం నుంచి చమురు, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాం. ఇంధన భద్రత విషయంలో మా విధానాలకు అనుగుణంగా.. వెనెజువెలా సహా ఏ దేశం నుంచైనా ముడి చమురు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఓ మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికా (USA)తో వాణిజ్య ఒప్పందం దేశ ఎగుమతులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, వృద్ధి, ప్రజల సంక్షేమానికి ఊతమిస్తుందని తెలిపారు. మరోవైపు.. ఇటీవలి ఇరాన్ ఆందోళనల సమయంలో అక్కడ ఉన్న భారతీయులు మృతి చెందినట్లు, తప్పిపోయినట్లు నివేదికలేవీ లేవని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్లమెంటుకు తెలిపింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక భారత పౌరులతో నిత్యం సంప్రదింపుల్లో ఉందని విదేశాంగశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. తాజా అంచనాల ప్రకారం.. ఆ దేశంలో దాదాపు 10 వేలమంది ప్రవాస భారతీయులు ఉన్నట్లు చెప్పారు.



## పాదాలను చూసి
# పేర్లు చెబుతున్న విద్యార్థి

శివమొగ్గ: కర్ణాటకకు చెందిన ఓ పదో తరగతి విద్యార్థి అరుదైన ప్రతిభ కనబరుస్తున్నాడు. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల ముఖాలను చూడకుండా, కేవలం పాదాలను చూసి వారిని గుర్తుపడుతున్నాడు. కర్ణాటక హోసనగరలోని రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భువన్ టాలెంట్‌ను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. భువన్ గతంలో తన స్నేహితులు, ఉపాధ్యాయులను వారి ముఖాలను చూడకుండా.. కేవలం గొంతుతోనే గుర్తుపట్టేవాడు. అలా ఓ సారి 200 మందిని గుర్తించాడు. ఆ తర్వాత పాదాలను చూసి పేర్లను చెప్పడం మొదలుపెట్టాడు. అయితే, తాను ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు వారి కాలి వేళ్లను గమనించి గుర్తుంచుకుంటానని భువన్ వివరించాడు. ఏ ఇద్దరి పాదాలూ ఒకేలా ఉండవని, కాలి వేళ్లు ప్రత్యేకంగా ఉంటాయని చెప్పాడు.

## వాషింగ్టన్ పోస్ట్ లేఆఫ్‌లు..
# ఉద్యోగం కోల్పోయిన శశిథరూర్ కుమారుడు ఇషాన్

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ ఉద్యోగం కోల్పోయారు. తాజాగా వాషింగ్టన్ పోస్ట్ పత్రిక లేఆఫ్ ఇచ్చిన వారిలో ఆయన కూడా ఉన్నారు. వ్యయభారాన్ని తగ్గించుకునేందుకు చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా.. మొత్తం ఉద్యోగాల్లో మూడో వంతు సిబ్బందికి ఈ సంస్థ కోత పెట్టింది. సీనియర్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కాలమిస్ట్‌గా పనిచేసిన ఇషాన్.. ఈ లేఆఫ్‌లపై ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''వాషింగ్టన్ పోస్ట్ లేఆఫ్‌లలో నాతో పాటు అంతర్జాతీయ వ్యవహారాలు చూసే పలువురు సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. 12 ఏళ్లుగా నేను ఈ సంస్థలోనే పని చేస్తున్నాను. ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులతో కలిసి పనిచేశాను. ఇప్పుడు ఈ పరిణామం తీవ్రంగా బాధిస్తోంది'' అని రాసుకొచ్చారు. ప్రపంచ వ్యవహారాలను అందులో అమెరికా పాత్రను పాఠకులు సమగ్రంగా అర్థం చేసుకునే లక్ష్యంతో 2017లో వరల్డ్ వ్యూ కాలమ్‌ను ఆవిష్కరించిన అంశాన్ని గుర్తుచేసుకున్నారు. దానిని ఆదరించిన సబ్‌స్క్రైబర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యూస్‌రూమ్‌ను, వాషింగ్టన్ పోస్ట్ నినాదం ఉన్న పోస్టర్‌ను షేర్ చేశారు. ఇదొక చెడ్డరోజు అనే వ్యాఖ్యను జోడించారు. ఫారిన్ బ్యూరోలు, స్థానిక రిపోర్టింగ్ బృందాలు, స్పోర్ట్స్ డెస్క్, బిజినెస్ విభాగంలోని ఉద్యోగాలపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది. ఈ వార్తా పత్రికను స్టిల్సన్ హచిన్స్



స్థాపించారు. 2013లో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ దీనిని సొంతం చేసుకున్నారు.

# విరబూసే బెలూన్ పూల మొక్క

**ఆహ్లాదకరమైన రంగులూ, చిత్రమైన ఆకారంలో అందంగా విచ్చుకుంటుందీ బెలూన్ ఫ్లవర్. మరి ఈ మొక్కని ఎలా పెంచుకోవాలో తెలుసా?**






బెలూన్ పూల మొక్క... శాస్త్రీయ నామం ప్లాటికోడాన్ గ్రాండిఫ్లోరస్. ఇది కాంపానులేసియా కుటుంబానికి చెందినది. తక్కువ నిర్వహణతో పెంచుకోగలిగే బహువార్షిక మొక్క ఇది. దీనికి బుడగల్లాంటి మొగ్గలు, నక్షత్ర ఆకారంలో పూలు పూస్తాయి. ఇవి నీలం, గులాబీ, తెలుపు రంగుల్లో వికసిస్తాయి. మొగ్గలు వచ్చే తీరుని బట్టే దీనికి బెలూన్ పూల మొక్కగా పేరొచ్చింది. తూర్పు ఆసియాలోని పలు దేశాల్లో విరివిగా కనిపిస్తుందీ మొక్క. ఆర్నమెంటల్ ప్లాంట్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. కొరియాలో దీని వేరుని సలాడ్‌లు, టీలు, ఔషధాల్లో ఉపయోగిస్తారు.

**సంరక్షణ సులువే...**

బెలూన్ ఫ్లవర్ మొక్కని పెంచడం సులువే. ఒక్కసారి నాటుకుంటే చాలా ఏళ్లపాటు నిలదొక్కుకుంటుంది. పూర్తి ఎండలో... అంటే కనీసం ఆరేడు గంటలైనా దీనికి ప్రత్యక్ష సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. నేలలోనే కాదు... కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు. అయితే, తరచూ మార్చడం, మొదలు చుట్టూ తవ్వడం వంటివి చేస్తే బతకదు. అందుకే, దీన్ని నాటేందుకు పెద్ద కుండీని ఎంచుకోవాలి. నీరు నిలవని సారవంతమైన మట్టిలో నాటుకోవాలి. బెలూన్ ఫ్లవర్ ప్లాంట్‌కి నీళ్లు క్రమం తప్పకుండా పోయాలి. కానీ, అవి ఎక్కువగా నిలవకుండా చూసుకోవాలి. లేదంటే ఫంగల్ వ్యాధులు సోకి మొక్క ఎదుగుదల దెబ్బతింటుంది. ఇక, దీనికి పూలు ఎక్కువగా పూయాలంటే... నెమ్మదిగా విడుదల అయ్యే బ్యాలెన్స్‌డ్ ఫెర్టిలైజర్‌ని అందించాలి. ముఖ్యంగా నీళ్లలో కరిగే ఎన్‌పీకే సమగ్ర ఎరువును 10:10:10 నిష్పత్తిలో ఇవ్వాలి. ఈ పూల మొక్కకు పేను బంక, సాలీడు, బూడిద తెగుళ్లు వస్తుంటాయి. అందుకే, ఎక్కువ తడి లేకుండా చూసుకోవడం, వేపనూనెను స్ప్రే చేయడం వంటి పనుల వల్ల అవి నియంత్రణలో ఉంటాయి. ఈ బెలూన్ పూల మొక్కని పెంచాలంటే.. విత్తనాలు లేదా నారు నాటుకోవచ్చు. దీని చిగుళ్లు గిల్లితే గుబురుగా పెరుగుతుంది. పూలు వాడిపోయాక తీసేయాలి. అప్పుడే నిండుగా పూస్తాయి. ఈ మొక్క తేనెటీగలు, సీతాకోకచిలుకలను ఎక్కువగా ఆకర్షించి... పెంచుకునే ప్రదేశానికి కొత్తందాన్ని తెచ్చిపెడుతుంది.




## అమ్మల కోసం..

# సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ చిట్కాలు!

**కొత్తగా తల్లైన మహిళలు ఓవైపు తాము కోలుకుంటూనే.. మరోవైపు తమ బిడ్డ ఎదుగుదల పైనా దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చనుబాలు ఎక్కువగా ఉత్పత్తయ్యే ఆహారానికి ప్రాధాన్యమివ్వాలి. అందులోనూ బిడ్డ పుట్టాక తొలి 40 రోజులు తీసుకునే ఆహారం కీలకమంటున్నారు ప్రముఖ సెలబ్రిటీ పోషకాహార నిపుణురాలు సుమన్ అగర్వాల్. ఈ సమయంలో కొన్ని పదార్థాల్ని రోజువారీ మెనూలో భాగం చేసుకుంటే తల్లిపాలు ఎక్కువగా పడే అవకాశం ఉందంటున్నారు. ఈ క్రమంలో బాలీవుడ్ నటి, రచయిత్రి సోహా అలీ ఖాన్ ఇటీవలే నిర్వహించిన పాడ్‌కాస్ట్ షోలో భాగంగా కొత్తగా తల్లైన మహిళల కోసం ఆమె కొన్ని చిట్కాలందించారు.**

**తొలి నలభై రోజుల్లో..**

బాలీవుడ్ నటి, రచయిత్రి సోహా అలీ ఖాన్ 'ఆల్ అబౌట్ హర్' పేరుతో తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ పాడ్‌కాస్ట్ షో నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన తాజా ఎపిసోడ్‌లో ప్రముఖ సెలబ్రిటీ పోషకాహార నిపుణురాలు సుమన్ అగర్వాల్ పాల్గొన్నారు. కొత్తగా తల్లైన మహిళలు చనుబాలు ఉత్పత్తయ్యేందుకు తీసుకోవాల్సిన కొన్ని పదార్థాల గురించి ఆమె తెలియజేశారు. 'బాలింతలకు సంబంధించి పూర్వకాలం నుంచి మన దేశంలో కొన్ని ఆహార పద్ధతులు అమల్లో ఉన్నాయి. మన పెద్దలు చెప్పినట్లు బిడ్డ పుట్టాక తొలి నలభై రోజుల్లో కొన్ని పదార్థాలు తీసుకోవడం వల్ల తల్లుల్లో పాల ఉత్పత్తి అధికమవుతుంది. ఇది బిడ్డకూ మేలు చేస్తుంది..' అంటున్నారు సుమన్.

**వాము.. ఇలా!**

చనుబాల ఉత్పత్తిని పెంచడంలో వామును మించింది లేదంటున్నారు సుమన్. డెలివరీ తర్వాత మహిళలు తొలి పది రోజులు దీన్ని రోజూ తీసుకోవడం వల్ల త్వరగా కోలుకోవచ్చంటున్నారు. 'ప్రసవం తర్వాత మహిళలు కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, త్వరగా కోలుకోవడానికి వాము ఉపయోగపడుతుంది. డెలివరీ అనంతరం తొలి పది రోజులు దీన్ని తీసుకోవడం వల్ల చనుబాల ఉత్పత్తి పెరుగుతుంది. గర్భాశయం తిరిగి పూర్వపు స్థితికి చేరుకుంటుంది.





శరీరంలోని విషపదార్థాల్నీ ఇది బయటికి పంపించేస్తుంది. ఇందుకోసం వామును కాస్త నలిపి లేదా బరకగా చేసుకొని.. దీన్ని నెయ్యి, గోంధ్, కాస్త బెల్లంతో కలిపి తీసుకోవాలి. ముఖ్యంగా అల్పాహారానికిమధ్యాహ్న భోజనానికి మధ్యలో లేదంటే సాయంత్రం స్నాక్స్ సమయంలో తీసుకుంటే మెరుగైన ఫలితాలుంటాయి..' అంటున్నారు సుమన్.

**గోంధ్ లడ్డూలు**

అలాగే ప్రసవానంతరం శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, ఎముకల దృఢత్వానికి గోంధ్ మేలు చేస్తుందంటున్నారు సుమన్. 'గోంధ్‌లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి చనుబాల ఉత్పత్తిని రెట్టింపు చేస్తాయి. ప్రసవ సమయంలో శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి, ఎముకల దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి దీన్ని తీసుకోవడం ముఖ్యం. నెయ్యి, నట్స్, సహజసిద్ధ తీపి పదార్థాలతో దీన్ని కలిపి తయారుచేసిన లడ్డూల్ని తీసుకుంటే ఫలితం ఉంటుంది..' అంటున్నారామె.

**జీర్ణశక్తికి.. మెంతులు!**

ప్రసవం తర్వాత కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తడం సహజమే. ఇలాంటప్పుడు మెంతులు మేలు చేస్తాయంటున్నారు సుమన్. 'డెలివరీ తర్వాత మెంతుల్ని ఆహారంలో చేర్చుకుంటే త్వరగా కోలుకోవచ్చు. ఇవి రక్తంలోని చక్కెర స్థాయుల్ని క్రమబద్ధీకరించడంతో పాటు జీర్ణశక్తిని పెంచుతాయి. ఫలితంగా ఈ సమయంలో వచ్చే జీర్ణ సంబంధిత సమస్యలు దూరమవుతాయి. అలాగే ఇవి చనుబాల ఉత్పత్తినీ పెంచుతాయి. కాబట్టి వీటిని రోజువారీ కూరల్లో భాగం చేసుకోవచ్చు.. లేదంటే పొడి చేసుకొని గోంధ్ లడ్డూల తయారీలోనూ వాడచ్చు..' అంటూ సలహా ఇస్తున్నారామె. వీటితో పాటు ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్.. వంటి పోషకాలు కూడా కొత్తగా తల్లైన మహిళలకు అవసరం అంటోన్న సుమన్.. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ ముఖ్యమంటున్నారు. తద్వారా తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉండచ్చని చెబుతున్నారు.

**అంబానీల న్యూట్రిషనిస్ట్!**

ఆక్స్‌ఫర్డ్‌లో న్యూట్రిషన్ కోర్సు చేసిన సుమన్.. ప్రముఖ పోషకాహార నిపుణురాలిగా, ఫుడ్ గురూగా, ఫిట్‌నెస్ నిపుణురాలిగా పేరు గాంచారు. తన పాతికేళ్ల సుదీర్ఘ కెరీర్‌లో దేశవిదేశాల్లో ఎంతోమందిలో ఆరోగ్య స్పృహ పెంచిన ఆమె.. అంబానీ, బిర్లా.. వంటి ప్రముఖ వ్యాపార దిగ్గజ కుటుంబాలకు వ్యక్తిగత న్యూట్రిషనిస్ట్‌గా వ్యవహరించారు. అలాగే ఆలియా భట్, అనన్యా పాండే, సోనాక్షి సిన్హా.. వంటి బాలీవుడ్ తారలకూ ఆరోగ్యకరమైన ఆహార చిట్కాలు అందించారు. ప్రస్తుతం 'సెల్ఫ్‌కేర్' అనే సంస్థను స్థాపించి.. ఈ వేదికగా ఎంతోమందికి ఆరోగ్యకరమైన జీవనశైలిని చేరువ చేస్తున్నారామె. ఆహారంఆరోగ్యకరమైన వంటకాలపై మక్కువతో పలు పుస్తకాలు రాసిన ఈ సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్.. 'అపరాజిత' వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలూ అందుకున్నారు. ప్రస్తుతం ఈమె ఇన్‌స్టా పేజీకి 1.68 లక్షల మంది ఫాలోవర్లున్నారు.



## లెక్కల తిప్పలు

# పోతాయిలా..!

**మా పిల్లలకు అన్ని సబ్జెక్టుల్లోనూ మంచి మార్కులు వస్తాయి, లెక్కల్లో తప్పించి... అంటూ చాలామంది తల్లిదండ్రులు చెబుతారు. మిగిలిన వాటిలా చదివితే వచ్చే సబ్జెక్టు కాదు గణితం. ప్రయోగం, అనుభవంద్వారా నేర్చుకోవడం దీన్లో ప్రధానం. ఆటలతో, దినచర్యలో భాగంగా నేర్చుకున్నప్పుడు లెక్కల్ని సులభంగా అర్థం చేసుకుంటారు.**

బొమ్మల్ని లెక్కించడం ద్వారా పిల్లలకు అంకెలు నేర్పవచ్చు. తమ దగ్గర ఎన్ని బొమ్మలు ఉన్నాయో చెప్పమంటూ ప్రోత్సహించాలి. పిల్లలచేత బిల్డింగ్ బ్లాక్స్ నిర్మించమని... ఎవరి బిల్డింగ్‌లో ఎన్ని బ్లాకులున్నాయి? ఇద్దరి మధ్య తేడా ఎంత? ఇలాంటివి చెప్పమనాలి.

>> అంకెల్ని నేలపైన రాసి జంపింగ్, స్కిప్పింగ్ వంటి ఆటల ద్వారానూ నేర్చుకోవచ్చు.

>> సంగీతం, లయబద్ధంగా నేర్చుకోవడంద్వారా లెక్కల్లో చురుగ్గా ఉంటారు. పద్ధతిలో చప్పట్లు కొట్టడం, వేర్వేరు సంగీత పరికరాలపైన సాధన ఇందుకు సాయపడతాయి.

>> స్నాక్స్‌గా పెట్టే పండ్లు, బిస్కెట్లతో వివిధ రకాల ఆకారాలూ, భిన్నాలను నేర్పించవచ్చు.

>> ట్రెజర్ హంట్ లాంటి గేమ్‌లు ఆడుతూ కార్డులపైన రాసిన అంకెల్నే ట్రెజర్‌గా పెట్టాలి. రెండు, మూడు, అయిదు వీటి గుణిజాల్ని కనిపెట్టమనాలి.

>> కథల్లో కూడా అంకెలు వచ్చేట్టు చూడండి. వ్యక్తులు, అందులోని వస్తువులకు సంబంధించి అంకెల్ని, కొలతల్ని ప్రధానంగా చేసి చూపండి.

>>కిడ్డీ బ్యాంకులోని కాయిన్లు లెక్కపెట్టమనొచ్చు. అంతేకాదు, ప్రయాణంలో ఉన్నప్పుడు మైలురాళ్లు, బస్సు నంబర్లు... ఇలాంటివి గుర్తించి చెప్పమనాలి.

MOVIE TIME



## 'దో దీవానే షెహర్ మే'
# ట్రైలర్ రిలీజ్

**టాకీస్:** ఆనీ ఆవవలిజీనివ గావష్టవతీ ఓవతిని । బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్నీ) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్ధాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యవార్ తెరకెక్కించాడు.

తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.

# మెగా ఫ్యాన్స్‌కు ఉగాది గిఫ్ట్..
## పవన్ కళ్యాణ్ కొత్త సినిమా ముహూర్తం అప్పుడే!

టాకీస్: పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, స్టార్ దర్శకుడు సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ బడ్జెట్ చిత్రం గురించి సినీ వర్గాల్లో ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2026 నూతన సంవత్సర కానుకగా జనవరి 1న అధికారికంగా ప్రకటించిన మేకర్స్.. ఇప్పుడు ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన ముహూర్తపు పూజా కార్యక్రమాలను నిర్వహించబోతున్నట్లు తెలుస్తుంది. మార్చి మొదటి వారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, పవన్ కళ్యాణ్ తన పొలిటికల్ షెడ్యూల్‌కు ఇబ్బంది కలగకుండా తక్కువ రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేసేలా ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం.



పవన్ కళ్యాణ్ ఆప్తమిత్రుడు రామ్ తాళ్లూరి 'జైత్ర రామ మూవీస్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ రచయిత వక్కంతం వంశీ ఈ చిత్రానికి పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను అందించగా, ఇందులో పవన్ కళ్యాణ్ ఒక మిలిటరీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పవన్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' పనులను ఫిబ్రవరి నాటికి పూర్తి చేసి, వెంటనే సురేందర్ రెడ్డి ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టనున్నారు. దాదాపు రూ. 75 కోట్ల భారీ రెమ్యూనరేషన్‌తో ఈ సినిమా తెరకెక్కుతోందని, ఇది పవన్ కెరీర్‌లో 32వ చిత్రంగా రాబోతోందని ఇండస్ట్రీ వర్గాల టాక్.

# నోరు జారాడు.. క్షమించండి
## చంద్రహాస్ వివాదంపై చిత్రబృందం క్లారిటీ



**టాకీస్:** టాలీవుడ్ బుల్లితెర నటుడు ప్రభాకర్ కుమారుడు చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'బరాబర్ ప్రేమిస్తా' చిత్ర ప్రీ-రిలీజ్ వేడుక తీవ్ర వివాదానికి కేంద్రబిందువుగా మారిన విషయం తెలిసిందే. ఈ వేడుకలో చంద్రహాస్ స్టేజీపై అసభ్య పదజాలం ఉన్న పాటను పాడటం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది. అయితే ఈ వివాదంపై తాజాగా దర్శకుడు, నిర్మాత స్పందిస్తూ.. విచారం వ్యక్తం చేశారు.

ఈ అంశంపై నిర్మాత చిన్ని మాట్లాడుతూ.. సినిమాలో అతడి పాత్ర గురించి చెప్పే ఉద్దేశ్యంతో ఆ పాట పాడాడు. అయితే ఆ పాటలో అతడు నోరు జారడం ఎవరు ఊహించలేదు. అతడు కూడా కావాలని చేయలేదు. ఈ విషయం గురించి మేము కూడా బాధపడుతున్నాం. ఈ పాట పాడిన అనంతరం కిందికి వచ్చిన చంద్రహాస్‌ని పిలిచి ఇంకోసారి అలా చేయకని చెప్పామని నిర్మాత అన్నాడు. దర్శకుడు సంపత్ రుద్ర కూడా ఈ వివాదంపై స్పందిస్తూ.. చంద్రహాస్ అలా పాడినందుకు చాలా బాధగా ఉంది. మేము ఎవరం అలా ఊహించలేదు. ఈ సినిమాలో అలాంటి వివాదాస్పదమైన అంశాలు లేవంటూ దర్శకుడు తెలిపాడు.



# ఆకట్టుకుంటున్న 'అస్సీ' ట్రైలర్



టాకీస్: బాలీవుడ్ స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను తన విలక్షణ నటనతో మరోసారి ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యింది. ప్రముఖ దర్శకుడు అనుభవ్ సిన్హా దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'అస్సీ'. ఈ సినిమా ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. తాప్సీ ఇందులో మరోసారి లాయర్ పాత్రలో(ఇంతకుముందు ముల్క్ చిత్రంలో) కనిపించబోతుంది. ఈ సినిమా టైటిల్‌ను హైలైట్ చేస్తూ.. దేశంలో ప్రతిరోజు 80 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని.. వారికోసం పోరాడే న్యాయవాది పాత్రలో తాప్సీ అలరించబోతుంది. అనుభవ్ సిన్హా-తాప్సీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'ముల్క్', 'థప్పడ్' చిత్రాలు సామాజిక అంశాలతో ఘనవిజయం సాధించాయి, దీంతో ఈ హ్యాట్రిక్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ కోర్ట్‌రూమ్ డ్రామాలో నసీరుద్దీన్ షా, రేవతి, కని కుస్రుతి, మనోజ్ పహ్వా వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## మళ్లీ జన్మంటూ ఉంటే
# దర్శకుడిగా పుట్టను: గుణశేఖర్



ప్రముఖ సీనియర్ దర్శకుడు గుణశేఖర్ తన కెరీర్, వ్యక్తిగత అనుభవాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో రూపొందిన సరికొత్త చిత్రం 'యుఫోరియా'. ఈ చిత్రం ఫిబ్రవరి 6వ తేదీన విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆయన ఆసక్తికర మళ్లీ జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

దర్శకత్వం వహించడం వల్ల ఎదురయ్యే విపరీతమైన ఒత్తిడిని దృష్టిలో పెట్టుకునే తాను ఆ మాట అన్నానని . చాలామంది భావిస్తున్నట్లు దీనికి సోషల్ మీడియా ట్రోలింగ్ కారణం కాదని గుణశేఖర్ స్పష్టం చేశారు. ఇది కేవలం ఒక దర్శకుడు భరించే మానసిక భారం మాత్రమేనని ఆయన తెలిపారు. ఏ వృత్తిలోనైనా పని పూర్తయ్యాక ఒక రకమైన సంతృప్తి లభిస్తుందని, కానీ దర్శకుడికి సినిమా విడుదలయ్యే వరకు ఆ ప్రశాంతత దొరకదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 1992లో తన సినీ ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు కంటినిండా నిద్రకు దూరమయ్యానని, కనీసం వచ్చే జన్మలోనైనా హాయిగా నిద్రపోవాలన్న ఆశతోనే దర్శకుడిగా పుట్టనని అన్నానని ఆయన నవ్వుతూ వివరణ ఇచ్చారు. ఈ వృత్తిలో తృప్తి అనేది దొరకడం చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు.

గుణశేఖర్ కుమార్తె నీలిమ గుణ నిర్మించిన ఈ 'యుఫోరియా' చిత్రంలో భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రస్తుత యువత ఆలోచనలకు దగ్గరగా ఉండే కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ ప్రెస్ మీట్‌లో నటి భూమికతో పాటు నిర్మాత నీలిమ గుణ కూడా పాల్గొని సినిమా విశేషాలను పంచుకున్నారు. ఫిబ్రవరి 6న విడుదల కానున్న ఈ సినిమాతో గుణశేఖర్ మళ్లీ తన మ్యాజిక్‌ను రిపీట్ చేస్తారని టాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# సీనియర్ నటి వాసవి కన్నుమూత..
## క్యాన్సర్‌తో పోరాడుతూ విజయనగరంలో తుదిశ్వాస

**టాకీస్:** తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ నటి వాసవి అలియాస్ పద్మ అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె బుధవారం తన స్వస్థలమైన విజయనగరంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషాద వార్తను నటి కరాటే కళ్యాణి సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. ఆమె మరణవార్తతో సినీ వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కరాటే కళ్యాణి తన ఫేస్‌బుక్ పోస్టులో పద్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. "నిన్ను కాపాడాలని ఎంతో ప్రయత్నించాను. కానీ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావు. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి" అంటూ ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు అనంతరం పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు వాసవికి సోషల్ మీడియా ద్వారా సంతాపం తెలుపుతున్నారు.



1978లో విజయనగరంలో జన్మించిన వాసవి, జయ వాహిని పేరుతో టెలివిజన్ మరియు సినీ రంగాల్లో మంచి గుర్తింపు సంపాదించారు. చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె అనేక తెలుగు, తమిళ చిత్రాల్లో నటించారు. సినిమాలతో పాటు సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో ఆమె నటన ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. 2019లో విడుదలైన 'రఘుపతి వెంకయ్య నాయుడు' చిత్రంలో వీకే నరేష్ సరసన నటించిన ఆమె, చివరిసారిగా 'బహిర్భూమి' సినిమాలో కనిపించారు.

గత కొన్ని సంవత్సరాలుగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న వాసవి ఆరోగ్య కారణాల వల్ల నటనకు దూరమయ్యారు. ఆమె పరిస్థితి విషమించడంతో వైద్యులు ఇంటికి తీసుకెళ్లాలని సూచించగా, కుటుంబ సభ్యులు విజయనగరానికి తరలించారు. అక్కడే ఆమె చివరి శ్వాస విడిచారు. తెరపై అనేక పాత్రలతో అలరించిన ఈ నటి ఇక లేరనే వార్త అభిమానులను తీవ్రగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఆమె మృతికి పలువురు నివాళులు అర్పిస్తున్నారు.

## జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో
# పూరీ జగన్నాథ్, చార్మి పూజలు

**పెద్దమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్న పూరీ జగన్నాథ్, చార్మి**

**పూరి జగన్నాథ్, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి కాంబోలో తెరకెక్కుతున్న ఓ భారీ పాన్ ఇండియా మూవీ**

టాకీస్: టాలీవుడ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, హీరోయిన్ ఛార్మి కౌర్ జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోని పెద్దమ్మ ఆలయంలో వీరిద్దరూ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మ దర్శనం అనంతరం ఆలయం నుంచి బయటకు వస్తున్న వీరిద్దరి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇదిలా ఉండగా.. టాలీవుడ్ డేరింగ్ డైరెక్టర్‌గా పేరున్న పూరి జగన్నాథ్, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ఓ భారీ పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. విజయ్ సేతుపతి పుట్టినరోజు సందర్భంగా జనవరి 16న ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.

ఈ మూవీకి స్లమ్ డాగ్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 33 టెంపుల్ రోడ్ అనే ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చిరిగిన దుస్తుల్లో బిచ్చగాడిలా కనిపిస్తూ.. చేతిలో కత్తి పట్టుకుని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా దర్శనమిచ్చాడు.



ఈ పాన్ ఇండియా మూవీలో హీరోయిన్‌గా సంయుక్త నటిస్తోంది. అలాగే టబు, విజయ్ కుమార్, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా ఈ మూవీని నిర్మిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.